'రాధా కృష్ణయాదవ్‌పై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి'

ముషీరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ్ మహాసభ సీనియర్ నాయకుడు రాధాకృష్ణ యాదవ్‌పై ఇటీవల మల్కాజిగిరిలో జరిగిన దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని మహాసభ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్‌యాదవ్, ఎడ్లహరిబాబు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాధాకృష్ణ యాదవ్‌పై దాడిచేసిన వారు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమం మహాసభ రాష్ట్రకోశాధికారి శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శి జగన్‌యాదవ్, కార్యవర్గ సభ్యులు జగదీష్‌యాదవ్, వేణుగోపాల్‌యాదవ్, రాష్ట్ర యువజనఅధ్యక్షుడు యశ్వంత్‌రాజ్‌యాదవ్, న్యాయ విభాగం గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి మురళీధర్‌యాదవ్, మల్కాజిగిరి నియోజకవర్గం అధ్యక్షుడు సతీష్‌యాదవ్ తదితరులు



పురస్కార గ్రహీతలతో అతిథులు

నిజాం వ్యతిరేక పోరాట గళం దాశరథి

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నిజాం వ్యతిరేక పోరాటగళం దాశరథి కృష్ణమాచార్య అని ప్రముఖ రచయిత, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మురళీమోహన్‌రాజు అన్నారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ఆయన అన్నారని వివరించారు. దాశరథి కృష్ణమాచార్యులు జయంతి సందర్భంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో కవిసమ్మేళనం, దాశరథి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. డా.ఆమంచి అంజయ్య, బలిజేపల్లి నాగరత్నం, ఇప్ప ఉమారాణి, నన్నపురాజు విజయలక్ష్మి, కాసర్ల సరోజినీదేవి, ఎమ్ఎస్‌కే.షా, మంత్రిప్రగడ మార్కండేయులు, జీఎస్ పార్థసారథి, లయన్ మేడిశెట్టి వెంకటేశ్వర్లు, మిద్దెసురేష్, జెర్రిపోతుల రాజులను పురస్కారాలతో సత్కరించారు. సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, సంఘసేవకుడు గంగాధర్‌రెడ్డి, సినీదర్శకుడు మాగంటి ప్రసాద్‌బాబు, నటులు రాజనాలసత్య, కుసుమధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు రాధా కుసుమ, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రవాసులు మాతృభాషను మరువలేదు'

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్నా కూడా మాతృభాషను మరువకపోవడం గర్వకారణం అని ఇట్‌క్లా, ఫాస్ ఫిలిం సొసైటీ చైర్మన్ డా.కె.ధర్మారావు అన్నారు. అమెరికా హెన్రీకోసాన్స్‌ప్లేస్‌లో సాయంకాల వేడుకలను కాలనీ సంఘం నాయకులు అక్కల మహేశ్వరప్రసాద్, జ్యోత్స్న పర్యవేక్షణలో ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ తాను రచించిన 86 వసంతాల తెలుగు సినిమా సమగ్ర గ్రంథాన్ని కాలనీవాసులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అమెరికా ఇట్‌క్లా అధ్యక్షుడు, సీనియర్ క్రికెటర్ రిచ్‌మండ్, సాఫ్ట్‌వేర్ ప్రముఖులు కె.శ్రీకల్యాణచక్రవర్తి, సురేందర్, జ్యోతిసురేందర్, రమేష్, యామినిరమేష్, శ్రీహిత్ తదితరులు పాల్గొన్నారు.

సుజాత అన్నమయ్య సంకీర్తనల గానం అభినందనీయం



చుండూరు సుజాతను సన్మానిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయని చుండూరు సుజాత తన వయస్సును సైతం లెక్కచేయకుండా మానసిక ధైర్యంతో కొన్ని గంటలపాటు అన్నమయ్య సంకీర్తనలను మధురంగా గానం చేసి తన ప్రతిభనున చాటుకున్నారని వక్తలు పేర్కొన్నారు. శ్రీశాంతి స్వరార్చన సంగీత సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో మధురగాయని లక్ష్మీశాంతి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనాగానావళి శీర్షిక పేరుతో అన్నమయ్య సంకీర్తన గాన గోష్టిని నిర్వహించారు. వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజు, ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు, గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి చింతపట్ల వెంకటాచారి, కోఆర్డినేటర్ మధుసూదన్‌రావు, గాయకుడు మురళి కోటంరాజు సుజాతను సన్మానించి, జీవన సాఫల్య పురస్కారాన్ని బహూకరించారు.



దోమలగూడ ఎస్ఐ విజయను సత్కరిస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులను ఆదుకోవాలి

కవాడిగూడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నిరుపేదవిద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, దోమలగూడ ఎస్ఐ కె.విజయ సూచించారు. ఉపాధ్యాయుడు, ఆలిండియా రేడియో, దూరదర్శన్ ఆర్టిస్ట్ పాలడుగు నాగయ్య జ్ఞాపకార్థం దోమలగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలడుగు సరోజనిదేవి, కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పరిమళ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధానకార్యదర్శి బొల్ల రమేష్, ఓబీసీమోర్చా డివిజన్ అధ్యక్షుడు ఎ.ప్రభాకర్ గంగపుత్ర. బీజేపీ సీనియర్ నాయకులుకు మార్‌గౌడ్, గద్దె శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలుచేయాలి: బీఎల్‌పీ



సమావేశంలో మాట్లాడుతున్న దండి వెంకట్

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు)(బీఎల్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో వెంకట్ అధ్యక్షత వహించి, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది బహుజన శ్రామిక కులాల ప్రజలు ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న అర్హులైన నిరుపేద కుటుంబాలకు పట్టాలు మంజూరుచేయాలని, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. బహుజనులకు జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరుచేసి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌పీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్, ప్రధానకార్యదర్శి ఎస్.సిద్ధిరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సబ్బని లత, ఎలిమినేటి శ్రీశైలం, సహాయ కార్యదర్శి సాయికృష్ణ, అన్ని జిల్లాలకు చెందిన పార్టీ కన్వీనర్లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

కవాడిగూడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొని, గాయాలైన గుర్తుతెలియని వ్యక్తి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 17న రామకృష్ణ మఠం వద్ద గుర్తుతెలియని వ్యక్తి (50) రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని ద్విచక్రవాహనం వచ్చి అతన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అపస్మారస్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు గాయాలపాలైన వ్యక్తిని చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీస్‌స్టేషన్ గానీ లేదా ఫోన్ నెంబర్ 9849563715లో గానీ సంప్రదించాలని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కోరారు.





బోనాలకు రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన ముషీరాబాద్ మహంకాళి దేవాలయం, ముషీరాబాద్‌లో భారీగా ఏర్పాటు చేసిన స్వాగత వేదికలు

బోనాలకు సర్వం సిద్ధం

అమ్మవారి ఆలయాలు ముస్తాబు

ముషీరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల నిర్వాహకులు, ప్రభుత్వ యంత్రాంగం సర్వం సిద్ధం చేశాయి. ముషీరాబాద్‌లోని అమ్మవారి ఆలయాలు ముస్తాబ్ చేశారు. మహాకాళి అమ్మవారి దేవాలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. బాపూజీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో కమిటీ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బారీకేడ్లను ఏర్పాటు చేశారు. ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ నాయకుడు కార్తిక్‌యాదవ్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తా నుంచి భరత్‌నగర్ వరకు డిజిటల్ లైట్లతో స్వాగత వేదికలు, దేవతామూర్తుల ప్రతిమలను దారి పొడవున ఏర్పాటు చేయడంతో అందరిని ఆకర్షిస్తున్నాయి. శివాలయం చౌరస్తా వద్ద బోనాల పండుగ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు పోటాపోటీగా ఫ్లెక్సీబోర్డులు, బ్యానర్లను ఏర్పాటు చేశారు.





విద్యుత్ కాంతుల్లో అమ్మవారి దేవాలయాలు

అంబర్‌పేట నియోజకవర్గంలో..

గోల్నాక: బోనాల ఉత్సవాలకు అంబర్‌పేట నియోజకవర్గంలో అమ్మవారి దేవాలయాలన్నీ ముస్తాబయ్యాయి. ఆదివారం, సోమవారం జరిగే బోనాల వేడుకలకు నియోజకవర్గంలో అమ్మవారి దేవాలయాలను నిర్వాహకులు రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పలు బస్తీల్లో అమ్మవారి పాటలు మార్మోగుతున్నాయి. వివిధ రాజకీయ పార్టీల నాయకులు బోనాల శుభాకాంక్షలు తెలుపుతూ భారీఫ్లెక్సీలను, బ్యానర్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో అంబర్‌పేట మహాకాళి దేవాలయం, నింబోలి అడ్డ మహాకాళి దేవాలయంలో భారీఎత్తున బోనాల ఉత్సవాలు జరుగుతాయి. చప్పల్‌బజార్‌లో ఫలహారం బండ్ల, అమ్మవారి బోనాల ఉత్సవాలకు సి.లడ్డుయాదవ్, కన్నె రమేష్‌యాదవ్ వేర్వేరుగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గోల్నాక డివిజన్‌లోని శాంతినగర్‌లోని పోచమ్మదేవాలయం, గంగానగర్‌లోని మహాకాళి, బంగారుమైసమ్మ దేవాలయాలు, లక్ష్మీనగర్‌లోని దేవినల్లపోచమ్మ దేవాలయం, అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులోని తిరుమనగర్‌లోని రేణుకాఎల్లమ్మ, నాగదేవత దేవాలయం, దుర్గానగర్‌లోని దుర్గామైసమ్మ దేవాలయంలో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.



బోనాలకు కిషన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు డీపీ రెడ్డి, శంకర్‌గౌడ్, గడ్డం శ్రీధర్ తదితరులు

సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాలు నిర్వహించాలి

రాంనగర్: అంబర్‌పేట నియోజకవర్గంలో ఆది, సోమవారం జరిగే బోనాల పండగను తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆమ్మవారి ఆలయాల ప్రతినిధులకు సూచించారు. అంబర్‌పేట మహంకాళి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే బోనాలకు హాజరు కావాలని కిషన్‌రెడ్డిని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు ఆహ్వానించారు.

● బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీకాలనీలోని వాటర్‌వర్క్స్ కార్యాలయం వద్ద నల్లపోచమ్మ ఆలయాన్ని బోనాల పండగ సందర్భంగా ముస్తాబు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రతినిధి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పరిశీలించారు.

పోతరాజుల వేషధారణలతో సందడి



రాంనగర్: రాంనగర్‌లోని కాకతీయ హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు పోతరాజు వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ గోక నవీన్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసేందుకు ఈ వేడుకలు నిర్వహించామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రామరాజు, ఏటి జ్యోతి, టీచర్లు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

బర్కత్‌పుర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన ఓ యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, అరెస్ట్‌చేశారు. కాచిగూడ ఎస్సై కృష్ణవేణి తెలిపిన వివరాల ప్రకారం.. చప్పల్‌బజార్‌కు చెందిన యువకుడు(16) ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ బాలిక(11)తో పరిచయం అయింది. ఆ బాలికను కలిసి, అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు బాలిక చెప్పడంతోపాటు కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు.

'నదుల అనుసంధానం చేయాలి'

బర్కత్‌పుర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గంగా, గోదావరి, కృష్ణ, కావేరి నదుల అనుసంధానం చేయాలని, దీనివలనే తెలంగాణ శశ్యశామలం అవుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ... బలకచర్ల అంశంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటన అక్షరసత్యం అని ఢిల్లీలో తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంలో ఈ అంశమే ప్రస్తావనకు రాలేదన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నేతలు తదితరులు పాల్గొన్నారు.

డీడీకాలనీలో రోడ్డు పనులు ప్రారంభం

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బాగ్ అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలో గల సాయిబాబా దేవాలయం మార్గంలో నూతనంగా వేస్తున్న బీటీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ డి.పద్మావెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, వెంకటరమణ, సునితా చౌదరి, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ పాల్గొన్నారు.

'న్యాయ వ్యవస్థపై సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలి'

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థ పట్ల నేటి న్యాయవిద్యార్థులు సంపూర్ణ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని అప్పుడే న్యాయవాదిగా రాణించే అవకాశం ఉంటుందని బార్ కౌన్సిలింగ్ ఆఫ్ ప్రొఫెసర్ ఎన్.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ఎ.నర్సింహారెడ్డి, డాక్టర్ ఎ.రాం ప్రసాద్, ప్రియాయాంగర్ పేర్కొన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవం జరిగింది. వారు మాట్లాడుతూ, న్యాయవాదులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయసలహాలు ఉచితంగా అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, అధ్యాపకులు పాల్గొన్నారు.

గీత వృత్తిలో ఉపాధి కల్పించాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ రమణ, పాల్గొన్న నాయకులు

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గౌడలకు గీత వృత్తిలో ఉపాధి కల్పించి, ప్రమాదాల నివారణకు చర్యలను చేపట్టాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వృత్తిలో ఉపాధి- ప్రమాదాల నివారణ అంశంపై వర్కుషాపు జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఈ కుటుంబాలను ప్రోత్సహించి, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ప్రకృతి పానియాన్ని అందిస్తున్న లక్షలాది మంది గీతకార్మికుల జీవనోపాధిని కాపాడాలన్నారు. వృత్తిలో ప్రమాదానికి గురైన 710మందికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా రూ.12.76 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆగస్టు 2 నుంచి 18 వరకు అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు వెంకటనర్సయ్య, నాయకులు గోవింద్, వెంకటమల్లయ్య, అచ్చాలు, గోపి, సీతారాములు, రమేష్‌గౌడ్, కిరణ్, అంజిబాబు, వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యారంగంలో మార్పులకు అనుగుణంగా బోధించాలి



విద్యార్థినికి బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రొఫెసర్ విద్యాసాగర్, అరోరా కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్



నృత్యం చేస్తున్న అరోర కళాశాల డిగ్రీ, పీజీ విద్యార్థులు

రాంనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యావిధానంలో మార్పులు చేసుకుంటూ బోధన చేయాలని ఓయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ విద్యాసాగర్ సూచించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో ఆరోరా, డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీలో కొత్తగా చేరిన విద్యార్థులకు పరిచయ్ ముగింపు కార్యక్రమం కళాభవన్‌లో జరిగింది. విద్యాసాగర్ మాట్లాడుతూ, కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు కళాశాల నియమ నిబంధనలకు అనుగుణంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఈ సంచాలకులు ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి, ఐకేఎస్ హెల్త్ టాలెంట్ ఒక్విజేషన్ సంచాలకురాలు దుర్గేష్ శ్రీవాత్సవ మాట్లాడారు. విద్యార్థుల నృత్యాలు, ఆటపాటలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదానం, మెడిటేషన్, యోగా, స్పోర్ట్స్ రంగాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అజయ్‌కుమార్, పద్మిని, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి : జైసింహ



బోనాల ఉత్సవాలకు బీఆర్ఎస్ యువ నాయకుడు జైసింహను ఆహ్వానిస్తున్న నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ సాంస్కృతికి అద్దం పట్టే బోనాల ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం ముషీరాబాద్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ ఆధ్వర్యంలో బాపూజీనగర్‌లో నిర్వహించే ఫలహార బండ్లు, పోతరాజుల ఊరేగింపునకు ముఠా జైసింహను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, పార్టీ నాయకులు బాలు, గిరి తదితరులు పాల్గొన్నారు.

కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో ఏరాట్లు పూర్తి



ముస్తాబైన కనకాల కట్టమైసమ్మ దేవాలయం

కవాడిగూడ: బోనాల ఉత్సవాలకు లోయర్ ట్యాంక్ బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయం సర్వం సిద్ధమైంది. బోనాలు, రంగం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోల్కొండ గౌతమ్‌కుమార్ పటేల్, ఆలయ ఈఓ సాంబశివరావు, ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ తెలిపారు. బోనాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు వారు తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని, వృద్ధులు, ఇబ్బందులు పడేవారికి రెండు ఎలక్ట్రిక్ వాహనాలతో వారిని గుడివరకు తీసుకెళ్లి వారికి దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. పారిశుధ్య చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను, తాగునీటి సౌకర్యం కల్పించాలని వాటర్‌వర్క్స్ అధికారులను కోరారు. ఆలయం వద్ద దోమలగూడ పోలీసులు, గాంధీనగర్ ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు కల్పిస్తారని తెలిపారు.

నల్లపోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయంలో..

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో నల్లపోచమ్మ, ఉప్పలమ్మ దేవాలయంలో బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అశోక్, వ్యవస్థాపకుడు శీలం సత్యనారాయణ తెలిపారు. 21న ఫలహారం బండిఊరేగింపు, శాంతిపూజ, 22న అమ్మవారి ఉత్సవ విగ్రహం రథ యాత్ర కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బోనాల పండగకు ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని అన్ని అమ్మవారి ఆలయాల వద్ద ఆదివారం జరిగే బోనాల పండుగకు ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు పనులను కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా శనివారం బాపూనగర్, పార్థివాడ బస్తీల్లో పనులను పరిశీలించాక కార్పొరేటర్ మాట్లాడారు. డివిజన్‌లో బోనాలు నిర్వహించే దేవాలయాలకు సుమారు 500 ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, బస్తీల ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న నేతాజీనగర్ బస్తీవాసులు

ప్రజల సహకారం మరువలేనిది : ఎమ్మెల్యే

చిక్కడపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోకవర్గం అభివృద్ధిలో అన్ని డివిజన్‌లలోని బస్తీలు, కాలనీల ప్రజలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని నేతాజీ నగర్‌లో 30 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న రోడ్లు, మంచినీరు, సివరేజీ సమస్యలను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే గోపాల్‌ను బస్తీప్రజలు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, పోతుల శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, ముచ్చకుర్తి ప్రభాకర్, పున్న రాజ్‌మోహన్, జి.వెంకటేష్, దేవయ్య, విఠల్, యాదగిరి, హనుమంతు, గౌస్, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి



బీసీకమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

కవాడిగూడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు సురేందర్, జై.ప్రకాష్ ఇతర కమిటీ సభ్యులకు బీసీ ఏ కలాల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ 'ఏ' కులాల హక్కుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాకుడు ప్రొఫెసర్ ఎ.భాగయ్య, అధ్యక్షుడు ఎంఎస్.నరహరి, తెలంగాణ ప్రదేశ్‌గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, బీసీ 'ఏ' కులాల అధికారప్రతినిధి కంటే రాంచందర్, అంబటి సుధాకర్‌గంగపుత్ర, వాణి, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా యాదగిరి, అధ్యక్షుడు పాండుగౌడ్, ప్రధానకార్యర్శి బత్తుల సాయిబాబా, గణేష్, శంకరయ్య తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ల హామీని అమలుచేయాలని కోరారు.

'బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చాలి'

కవాడిగూడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని పార్లమెంట్‌లో చట్టంచేసి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ధర్మ సమాజ్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గుడపర్తి సంతోష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ధర్మ సమాజ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భవన్‌లో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలనే అంశంపై విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు నర్సింగ్ కిరణ్, జి.రాజు పాల్గొన్నారు.

చతుర్మాస దీక్షలు ప్రారంభం

బర్కత్‌పుర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ లింగంపల్లిలోని ఉత్తరాది మఠంలో చతుర్మాస దీక్షలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ దీక్షలు సెప్టెంబర్ 7వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా లింగంపల్లి చౌరస్తా నుంచి ఉత్తరాది మఠం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. శనివారం రాత్రి 7.30గంటలకు లింగంపల్లి చౌరస్తాకు వచ్చిన ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మాతీర్థ శ్రీపాదుల స్వామీజీకి భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కాచిగూడ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362